



EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4 PM

www.suryaa.com

మంగళవారం

09-09-2025

పేజీలు: 02




## విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆర్‌ఎంహెచ్‌పీ విభాగంలో నిల్వ ఉంచిన కోకింగ్ కోల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఎండ వేడికి పెద్ద కుప్పలుగా ఉన్న కోల్ నుంచి భారీగా మంటలు ఎగసిపడడంతో.. చుట్టూ ఉన్న ప్రాంతంలో పొగలు వ్యాపించాయి. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు.



## ఉపరాష్ట్రపతి ఎన్నిక పోలింగ్ ప్రారంభం

భారత ఉపరాష్ట్రపతి ఎన్నిక పోలింగ్ ప్రారంభమైంది. మంగళవారం ఉదయం పార్లమెంట్ హౌస్ లో ఉపరాష్ట్రపతి ఎన్నిక పోలింగ్ జరుగుతోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తొలి ఓటు వేశారు. పార్లమెంట్ ఉభయసభల సభ్యులు ఎంపిలతో కూడిన ఎలక్టోరల్ కాలేజ్ ద్వారా ఈ ఎన్నిక జరుగుతుంది. ఎంపిలు తమ ఓట్ల ను పార్లమెంట్ హౌస్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ ఆరు గంటలకు ప్రారంభమవుతుంది. ఫలితం సాయంత్రం దాటిన తరువాత ఎప్పుడైనా ప్రకటిస్తారు. అధికార ఎన్డీయే నుంచి సీపీ రాధాకృష్ణన్ పోటీలో ఉండగా.. ఇండియా కూటమి నుంచి బి.సుదర్శన్ రెడ్డి బరిలో ఉన్నారు. ఈ ఎన్నికలో మొత్తం 770 మంది ఎంపీలు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీంతో మెజారిటీకి కావాల్సింది 386 ఓట్లు. అయితే, అధికార ఎన్‌డిఎ గెలిచేందుకు అవసరం అయిన మెజార్టీ ఉంది. బిఆర్‌ఎస్ ఈ ఎన్నికకు దూరంగా ఉంది.

## స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యం?

రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు తేలాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు వీలైనంత త్వరలోనే హైకోర్టును గడువు కోరనున్నట్లు సమాచారం. ఈ నెల 30 లోపు స్థానిక ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు గడువు విధించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఓటరు స్లిప్పులు కూడా తయారు చేసింది. ఈ క్రమంలో రాష్ట్ర సర్కార్ ఎన్నికలకు మరికొంత వ్యవధి కోరేందుకు సిద్ధమవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది




## క్యాన్సర్‌కు వ్యాక్సిన్‌ను కనుగొన్న రష్యా

ప్రపంచవ్యాప్తంగా ప్రాణాంతకంగా మారింది క్యాన్సర్ మహమ్మారి. అనేక రకాలుగా మానవాళిని పట్టిపీడిస్తోంది. దీన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు సరైన టీకాలు లేవు. ఈ క్రమంలో రష్యా అద్భుతం సృష్టించింది. క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టేందుకు బ్రహ్మాస్త్రాన్ని అభివృద్ధి చేసింది! ఎంటెరోమిక్స్ (Enteromix) అనే క్యాన్సర్ టీకాను రెడీ చేసింది. ఈ వ్యాక్సిన్ ప్రీ-క్లినికల్ ట్రయల్స్‌లో 100 శాతం ప్రభావం చూపించిందని రష్యా అధికారులు ప్రకటించారు. ఇప్పుడిది క్లినికల్ ట్రయల్స్‌కు సిద్ధంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. పలు అగ్రెసివ్ క్యాన్సర్లను ఎదుర్కోవడంలో ఇది ఎంతగానో ఉపయోగపడనుందని వెల్లడించారు. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఎన్ని రకాలుగా క్యాన్సర్ విజృంభిస్తోంది? వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయడం రష్యాకు ఎలా సాధ్యమైంది? అమెరికా ఎందుకు చేయలేకపోయింది? క్యాన్సర్‌తో ఈ టీకా ఎలా పోరాడుతుంది? ఇప్పటికే క్యాన్సర్ బారిన పడిన వారి పరిస్థితి ఏంటి? అనే వివరాలు తెలుసుకుందాం.

ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ విజృంభణ.. 200లకు పైగా రకాల క్యాన్సర్లు మానవాళిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అందులో లంగ్, బ్రెస్ట్, కొలోరెక్టర్, ప్రోస్టేట్, స్టొమక్, బ్లడ్ క్యాన్సర్ వంటివి ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. శరీరంలోని వివిధ భాగాల్లో క్యాన్సర్ కణాలు నియంత్రించలేని విధంగా పెరుగుతాయి. మిగతా శరీర భాగాలకు కూడా వ్యాపించి మరణానికి దారి తీస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం.. 2020లో దాదాపు కోటి మంది క్యాన్సర్ బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. అంటే ప్రతి ఆరు మరణాల్లో ఒక చావుకి.. క్యాన్సరే కారణం. 2022 నాటికి దాదాపు 2 కోట్ల కొత్త క్యాన్సర్ కేసులు నమోదైతే.. దాదాపు కోటి మంది (97 లక్షలు) ప్రాణాలు కోల్పోయారని అమెరికన్ క్యాన్సర్ సొసైటీ వెల్లడించింది. 2050 వరకు 3.5 కోట్ల క్యాన్సర్ కేసులు నమోదు కావొచ్చని అంచనా వేసింది.

**వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయడం రష్యాకు ఎలా సాధ్యమైంది?**

పెరుగుతున్న క్యాన్సర్ కేసుల దృష్ట్యా టీకా తయారు చేయడానికి ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. అందులో న్యూయార్క్‌కు చెందిన మెమోరియల్ స్లోయాన్ కెట్టెరింగ్ (MSK) సంస్థ.. పాంక్రియాటిక్ క్యాన్సర్‌పై విస్తృతంగా పరిశోధనలు చేస్తోంది. ఇక ప్రోస్టేట్ క్యాన్సర్ కోసం Sipuleucel-T అనే టీకాను అమెరికా అభివృద్ధి చేసింది. ఇలా ఇప్పటికే పలు ప్రివెంటివ్, థెరపాటిక్ వ్యాక్సిన్లు ఉన్నాయి. ప్రతి క్యాన్సర్ రోగికి ప్రత్యేకంగా చికిత్స అందించేందుకు థెరపాటిక్ వ్యాక్సిన్ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది రష్యా.



## హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 5. 5 కోట్ల నిధులు

రాయికోడ్ నుండి రాఘవపూర్ రోడ్డు మార్గంలో కూస్నూర్ గ్రామం వద్ద హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 5.50 కోట్ల నిధులు మంజూరైనట్లు మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం తెలిపారు. ప్రజల విజ్ఞప్తి మేరకు ఈ బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు, అధికారులు వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు.

## నేటి నుంచి ఆసియా కప్ ప్రారంభం

**తొలి మ్యాచ్‌లో తలపడనున్న అఫ్ఘనిస్తాన్ - హాంకాంగ్**



ఆసియా కప్ 2025 నేటి నుంచి ప్రారంభమవుతోంది. అఫ్ఘనిస్తాన్, హాంకాంగ్ మధ్య ఆరంభ మ్యాచ్ జరగనుంది. అబుదాబి వేదికగా రాత్రి 8 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే, ఈ ఆసియా కప్‌లో హాంకాంగ్ జట్టు అండర్ డాగ్‌గా బరిలోకి దిగనుండగా, అఫ్ఘనిస్తాన్ గ్రూప్ బీలో ఫేవరెట్‌గా ఉంది. ట్రై సిరీస్‌లో విఫలమైన అఫ్ఘన్లు ఇవాళ జరిగే మ్యాచ్‌లో హాంకాంగ్‌పై విజయం సాధిస్తారా? లేక ఏదైనా ట్విస్ట్ ఇస్తారా? అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రషీద్ ఖాన్ సారథ్యంలో అఫ్ఘనిస్తాన్ రెండు రోజుల కిందటే షార్జాలో జరిగిన ట్రై-సిరీస్ ఫైనల్‌లో పాకిస్తాన్ చేతిలో ఘోర ఓటమి పాలైంది. ఆ గాయాన్ని మాన్పుకునేందుకు, బంగ్లాదేశ్, శ్రీలంకతో జట్లు ఉన్న గ్రూప్ బీలో బలంగా నిలబడేందుకు మొదటి మ్యాచ్‌లో గెలిచి తీరాలని చూస్తోంది. హాంకాంగ్ మాత్రం అండర్ డాగ్‌గా ఈ టోర్నమెంట్‌లో అడుగుపెడుతోంది. అయితే ఈ రెండు జట్ల మధ్య హెడ్ టు హెడ్ రికార్డు అంతంత మాత్రంగానే ఉంది. ఐదు టీ20ల్లో ఆఫ్ఘనిస్తాన్ మూడు మ్యాచ్‌లు గెలవగా, హాంకాంగ్ రెండింటిలో విజయం సాధించింది. అంటే ఇరు జట్లు పోటాపోటీగా ఉన్నాయని తెలుస్తోంది. అబుదాబీ షేక్ జాయెద్ స్టేడియంలో మాత్రం అఫ్ఘనిస్తాన్‌దే పైచేయిగా ఉంది. అఫ్ఘన్ ఇక్కడ 16 టీ20లు ఆడి 11 మ్యాచ్‌లలో విజయం సాధించింది. హాంకాంగ్ మాత్రం 10 మ్యాచ్‌లు ఆడి కేవలం మూడింటిలోనే గెలిచింది. ఆఫ్ఘనిస్తాన్ బౌలింగ్ లైనప్ చాలా బలంగా ఉన్నా, వారి బ్యాటింగ్ మాత్రం ఎప్పుడు విఫలమవుతుందో ఎవరూ చెప్పలేరు. ఇది హాంకాంగ్‌కి ఒక చిన్న అవకాశం ఇచ్చే అంశం. అయినప్పటికీ, యూఏఈ పరిస్థితులకు సరిగ్గా అలవాటు పడిన అఫ్ఘనిస్తాన్ ప్రస్తుతానికి చాలా స్ట్రాంగ్‌గా కనిపిస్తోంది.

అఫ్ఘనిస్తాన్ జట్టు అంచనా

రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), ఇబ్రహీం జాద్రాన్, సెదీకుల్లా అటల్, దర్వీష్ రసూలీ, కరీమ్ జనత్, అజ్మతుల్లా ఒమర్జాయ్, రషీద్ ఖాన్ (కెప్టెన్), మహ్మద్ నబీ, ఏఎం ఘజనఫర్, నూర్ అహ్మద్, ఫజల్‌హక్

## భారత ఆర్చర్లకు నిరాశ



ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత కాంపౌండ్ ఆర్చర్లు నిరాశపరిచారు. పురుషుల టీమ్ ఈవెంట్‌లో స్వర్ణంతో కొత్త చరిత్ర లిఖించిన మన ఆర్చర్లు వ్యక్తిగత విభాగంలో అదే జోరు కొనసాగించలేకపోయారు. చారిత్రక పసిడి అందించిన రిశబ్ యాదవ్, అమన్ సైనీ, పార్థమేశ్ పతక పోరులో నిలువలేకపోయారు. హోరాహోరీగా సాగిన పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత క్వార్టర్స్‌లో పార్థమేశ్ 10-9(షూటాఫ్) తేడాతో మాతియస్ ఫుల్టన్(డెన్మార్క్) చేతిలో ఓడి నిష్క్రమించాడు. నాలుగు రౌండ్ల పోరులో ఇద్దరు చెక్కుచెదరని గురితో బాణాలు సంధించడంతో స్కోరు 148-148 సమమైంది. విజేతను నిర్ణయించేందుకు జరిగిన షూటాఫ్‌లో పార్థమేశ్ ఒక పాయింట్ తేడాతో ఓటమివైపు నిలువాల్సి వచ్చింది. మరోవైపు రిశబ్ యాదవ్, అమన్‌సైనీ క్వార్టర్స్‌లోనే తమ పోరాటాన్ని ముగించారు.



## ప్రియురాలి మృతిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న ప్రియుడు

"వచ్చే జన్మలో అయినా నా బంగారు తల్లిని పెళ్లిచేసుకుంటా" అంటూ సూసైడ్ లేఖ రాసి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు హైదరాబాద్—ఘట్‌కేసర్ పరిధిలోని ఓ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతూ సెలవులకు ఇంటికి వెళ్లిన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కొర్విచల్మ గ్రామానికి చెందిన దుంపటి అంజన్న కూతురు హితవర్షిణి(20). తిరిగి కళాశాల ప్రారంభం అవుతుండడంతో హైదరాబాద్ వచ్చి, బీబీనగర్—ఘట్‌కేసర్ మధ్యలోని రైల్వే ట్రాక్ వద్ద ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకున్న హితవర్షిణి, యువతి చివరిగా తన గ్రామానికి చెందిన వినయ్ బాబు (28) అనే అబ్బాయితో ఫోన్ మాట్లాడింది అని తెలిసి, విచారించేందుకు వెళ్లగా అతను కూడా బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తెలుసుకున్న పోలీసులు. యువకుడు రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా, వీరిద్దరు ప్రేమించుకున్నారని, పెద్దలు వీరి పెళ్లికి నిరాకరించడంతోనే ఈ దారుణానికి పాల్పడ్డారని నిర్ధారించిన పోలీసులు.

## నభా నటేశ్ హాట్ లుక్స్


సినీరంగంలోకి ఇప్పుడిప్పుడే వరుస ఆఫర్స్ అందుకుంటూ బిజీగా ఉంటుంది ఈ హీరోయిన్. ఎలాంటి బ్యాగ్రౌండ్ సపోర్ట్ లేకుండానే నటనపై ఆసక్తితో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. కానీ ఈ బ్యూటీ నటించిన సినిమాలు అంతగా మెప్పించకపోవడంతో ఈ అమ్మడుకు ఆశించిన స్థాయిలో బ్రేక్ రాలేదు. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే యాక్సిడెంట్ కారణంగా సినిమాలకు దూరమైన ఈ వయ్యారి.. కొన్నాళ్లు సినిమాలకు దూరమయ్యింది. ప్రస్తుతం బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ బిజీగా ఉంటుంది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. హీరోయిన్ నభా నటేష్. ప్రస్తుతం యంగ్ హీరో నిఖిల్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న స్వయంభు చిత్రంలో నటిస్తుంది. ఇందులో సంయుక్త మీనన్ సైతం కథానాయికగా నటిస్తుంది. తాజాగా నభా నటేష్ కు క్రేజీ ఆఫర్ వచ్చినట్లుగా తెలుస్తోంది. టాలీవుడ్ డైరెక్టర్ గోపిచంద్ మలినేని దర్శకత్వంలో బాలీవుడ్ సూపర్ స్టార్ సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో జాట్ అనే సినిమా రూపొందుతుంది.పవర్ ఫుల్ యాక్షన్ ప్యాక్డ్ సినిమాగా వస్తోన్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING 4PM EDITION

# ఆర్ఆర్‌బీ రైల్వే గ్రూప్ డి పరీక్షల తేదీలు వచ్చేశాయ్



కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని రైల్వే మంత్రిత్వ శాఖ ఆర్ఆర్‌బీ గ్రూప్ డి పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను తాజాగా విడుదల చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్షలను నవంబర్ 17 నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు నిర్వహించనుంది. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్‌ను రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (RRB) అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నోటిఫికేషన్ కింద దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే జోన్లలో మొత్తం 32,438 గ్రూప్ డి లెవల్ 1 పోస్టులను భర్తీ చేయనుంది. కాగా ఇప్పటికే ఈ పోస్టులకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యింది. ఆర్ఆర్‌బీ ఎగ్జామ్ తేదీకి వారం రోజుల ముందుగా సిటీ ఇంటిమేషన్ స్లిప్‌లను విడుదల చేయనుంది. ఇక పరీక్షకు నాలుగు రోజుల ముందు అడ్మిట్ కార్డులను అందుబాటులోకి తీసుకురానుంది. అభ్యర్థులు తమ వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆర్ఆర్‌బీ సూచించింది.



## కలిసిరాని రీ-ఎంట్రీ

టాలీవుడ్‌లో రీ-ఎంట్రీ ఇచ్చేందుకు చాలా మంది చాలా ప్రయత్నాలు చేశారు. అయితే, కొందరికీ రీ-ఎంట్రీలో సాలిడ్ హిట్ పడుతుంది. కానీ, మరికొందరికీ ఈ రీ-ఎంట్రీ కలిసిరాలేదు. ఇటీవల టాలీవుడ్‌లో ముగ్గురు హీరోయిన్లు రీ-ఎంట్రీ ఇచ్చారు. కానీ, ఏ ఒక్కరికీ కూడా సాలిడ్ కమ్ బ్యాక్ మాత్రం రాలేదు. మన్మథుడు, రాఘవేంద్ర చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన అన్షు ఇటీవల 'మజాకా' చిత్రంతో రీఎంట్రీ ఇచ్చింది. కానీ, బాక్సాఫీస్ దగ్గర ఈ సినిమా ఫ్లాప్‌గా నిలిచింది. ఇక నితిన్ హీరోగా తెరకెక్కిన 'తమ్ముడు' సినిమాతో నటి లయ కూడా తన రీ-ఎంట్రీపై భారీ అంచనాలు పెట్టుకుంది. కానీ, ఈ సినిమా కూడా డిజాస్టర్‌గా మిగిలింది. మరో హీరోయిన్ జెనీలియా 'జూనియర్' చిత్రంతో టాలీవుడ్‌లో రీ-ఎంట్రీ ఇచ్చింది. కానీ, ఆమెకు ఈ సినిమాతో అనుకున్న గుర్తింపు అయితే రాలేదు. మొత్తానికి ముగ్గురు హీరోయిన్లు రీ-ఎంట్రీతో మంచి కమ్ బ్యాక్ ఇవ్వాలని చూసినా, వారికి బ్యాడ్ లక్ ఎదురైంది.

## గోదావరి ఫేజ్-2,3 ప్రాజెక్టుకు శ్రీకారం





హైద్రాబాద్ ప్రజల దాహార్తిని తీర్చేందుకు గోదావరి తాగునీటి సరఫరా పథకాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు.తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేస్తోంది. ప్రధానంగా ప్రజలకు అవసరమైన త్రాగునీటి సరఫరాలాంటి మౌలిక సదూపాయాలకు పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగా హైదరాబాద్ నగరానికి 20 టీఎంసీల అదనపు నీటిని తరలించడానికి, మూసీ పునరుజ్జీవనంకోసం జంట జలాశయాలను గోదావరి నీటితో నింపడానికి రూ. 7,360 కోట్ల వ్యయంతో గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్-2&3 ప్రాజెక్టును సోమవారం గండిపేట వద్ద గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాలకు అన్ని సోర్సుల నుంచి 580 ఎంజీడీల నుంచి 600 ఎంజీడీల నీరు సరఫరా చేస్తున్నారు. 2030వ సంవత్సరం వరకు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని 300 ఎంజీడీల అదనపు జలాలను సరఫరా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గోదావరి నది నుంచి మొత్తం 30 టీఎంసీల నీరు వాడుకునే వెసులుబాటు ఉండటంతో.. అదనపు జలాల కోసం గోదావరి ప్రాజెక్టు ఫేజ్-2,3 లను రూపకల్పన చేసింది. 2027 సంవత్సరం వరకు.. హైదరాబాద్ నగర తాగునీటి డిమాండ్ 835 ఎంజీడీలకు పెరుగుతుంది. 2047 నాటికి ఈ సంఖ్య 1114 ఎంజీడీలుగా ఉండనుంది. అందులో భాగంగానే ఈ ప్రాజెక్టు పనులను ప్రారంభించింది. గోదావరి డ్రికింగ్ వాటర్ సప్లై పథకం ఫేజ్-1 కింద.. నగర ప్రజల నీటి అవసరాల కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలి ఇప్పటికే 10 టీఎంసీల నీరు తరలిస్తోంది. తాజాగా పథకంలో రెండు దశల ద్వారా మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి మరో 20 టీఎంసీల నీరు వాడుకునే అవకాశం ఉంది. ఈ 20 టీఎంసీల్లో.. 17.5 టీఎంసీలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు పోగా, మూసీ ప్రక్షాళనలో భాగంగా.. జంట జలాశయాలను పునరుజ్జీవనం చేసేందుకు మిగిలిన 2.5 టీఎంసీలను ఉపయోగించనున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల రెండు లాభాలున్నాయి. ఒకటి హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చడం, రెండోది.. మూసీ ప్రక్షాళన, జంట జలాశయాల పునరుజ్జీవం చెయ్యడం.

## రాజకీయ సంక్షోభం.. ప్రధాని ఓలీ రాజీనామా.. సైన్యం చేతుల్లోకి పాలన



సోషల్ మీడియాపై బ్యాన్ , అవినీతికి వ్యతిరేకంగా యువత చేపట్టిన ఆందోళనలు నేపాల్‌లో రాజకీయ సంక్షోభానికి దారితీశాయి. నేపాల్ ప్రధాన మంత్రి కేపీ శర్మ ఓలీ పదవికి రాజీనామా చేసి, తన బాధ్యతలను డిప్యూటీ పీఎంకి అప్పగించారు. అనారోగ్య కారణాలతో ఆయన దుబాయ్ వెళ్లే ప్రయత్నాలు చేస్తున్న ఓలీ.. యూఏఈ ప్రభుత్వ ఆశ్రయం కోరినట్టు తెలుస్తోంది. ఆయన సురక్షితంగా దేశం విడిచి వెళ్లేందుకు సైన్యం అనుమతించింది. ఆర్మీ సూచనలతో ఓలీ పదవి నుంచి తప్పకోవడం గమనార్హం. మంగళవారం సాయంత్రం కొత్త ప్రధానిని ప్రకటించే అవకాశం ఉంది. అంతకు ముందు, సోమవారం రాత్రి అత్యవసర క్యాబినెట్ సమావేశం ఏర్పాటుచేసిన కేపీ శర్మ.. సోషల్ మీడియాపై నిషేధాన్ని తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయినా కానీ, నేపాల్ యువత ఆగ్రహం మాత్రం చల్లారలేదు. మంగళవారం కూడా నిరసలు కొనసాగాయి. అధ్యక్షుడు, ప్రధాని, మంత్రుల నివాసాలకు ఆందోళనకారులు నిప్పంటించారు. ఆర్థిక మంత్రిపై కూడా దాడికి పాల్పడ్డారు. ఇలా వరుస ఆందోళనలతో హోం శాఖ, ఆర్థిక శాఖ సహా పలువురు మంత్రులు ఇప్పటికే తప్పుకున్నారు. తాజాగా, ప్రధాని కూడా రాజీనామా చేయడంతో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ఇక, ప్రజాందోళనల నేపథ్యంలో ప్రభుత్వంలో కొనసాగడం తమవల్ల కాదని మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ప్రధాని మాత్రం పదవిలో ఉంటారని ఓ మంత్రి చెప్పిన కొద్దిసేపటికే ఓలీ రాజీనామా చేయడం గమనార్హం.




## యాంటీ ఫ్యాన్స్‌ను ట్రోల్ చేసిన రామ్

'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా కోసం చిత్ర కథానాయకుడు రామ్ 'నువ్వుంటే చాలే..' అనే ఓ పాటను రాసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ గీతం శ్రోతల్ని అలరిస్తున్నది. సోమవారం ఈ చిత్రంలోని రెండో గీతం 'పప్పీ షేమ్..'ను రిలీజ్ చేశారు. ఈ పాటను హీరో రామ్ ఆలపించడం విశేషం. వివేక్ అండ్ మెర్విన్ స్వరపరచిన ఈ గీతాన్ని భాస్కరభట్ల రచించారు. ఎనర్జిటిక్ బీట్‌తో యూత్‌ని ఆకట్టుకునేలా ఈ పాట సాగింది. ఈ సినిమాలో హీరో రామ్.. ఓ సినీ హీరో అభిమాని పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. తన అభిమాన హీరో సినిమా విజయాన్ని ఎంజాయ్ చేస్తూ, పందెం ఓడిపోయిన యాంటీ ఫ్యాన్స్‌ను ట్రోల్ చేస్తున్నట్లుగా 'పప్పీ షేమ్' గీతం సాగింది. రామ్ తన గ్యాంగ్‌తో సెలబ్రేషన్ మోడ్‌లో కనిపించారు. ఈ సినిమా నవంబర్ 28న విడుదలకానుంది. భాగ్యశ్రీబోర్సే, ఉపేంద్ర, రావు రమేష్, మురళీశర్మ, సత్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్ అండ్ మెర్విన్, నిర్మాణ సంస్థ: మైత్రీ మూవీ మేకర్స్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: మహేష్‌బాబు.పి.



## AIతో అశ్లీల కంటెంట్.. ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ఐశ్వర్య రాయ్

బాలీవుడ్ స్టార్ నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. తన అనుమతి లేకుండా తన ఫోటోలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ద్వారా సృష్టించబడుతున్న అశ్లీల చిత్రాలను అడ్డుకోవాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐశ్వర్య పేర్కొంది.అయితే ఈ కేసు నేడు విచారణకు రాగా.. ఐశ్వర్య తరపున వాదించిన సీనియర్ అడ్వకేట్ సందీప్ సేథీ మాట్లాడుతూ.. మా క్లయింట్(ఐశ్వర్య రాయ్) చిత్రాలు కానీ, రూపం కానీ ఉపయోగించుకునే హక్కు ఎవరికీ లేదు. ఒక వ్యక్తి ఆమె పేరు ముఖాన్ని ఉపయోగించి AI ద్వారా డబ్బు సంపాదిస్తున్నాడు అని సేథీ వాదించారు. ఆమె పేరు రూపం ఎవరిదో లైంగిక కోరికలు తీర్చడానికి ఉపయోగించబడుతోంది. ఇది చాలా దురదృష్టకరం అని ఆయన కోర్టు ముందు పేర్కొన్నారు. అయితే ఐశ్వర్య పిటిషన్‌ని విచారించిన జస్టిస్ తేజస్ కరియా దీనిపై ప్రతివాదులకు వ్యతిరేకంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తామని సూచించింది. ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 7న జాయింట్ రిజిస్ట్రార్ ముందుకి.. ఆ తర్వాత జనవరి 15, 2026న కోర్టు ముందుకి వాయిదా వేసినట్లు హైకోర్టు తెలిపింది.

# అల్కరాజ్ అదుర్స్



ఫైనల్లో సిన్నర్‌పై అద్భుత విజయం

ప్రతిష్టాత్మక యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో స్పెయిన్ నయాబుల్ కార్లోస్ అల్కరాజ్ గర్జించాడు. ఆదివారం అర్ధరాత్రి(భారత కాలమానం ప్రకారం) జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో అల్కరాజ్ 6-2, 3-6, 6-1, 6-4తో టాప్‌సీడ్, డిఫెండింగ్ చాంపియన్ జానిక్ సిన్నర్‌పై అద్భుత విజయం సాధించాడు. గ్రాండ్‌స్లామ్ హార్డ్ కోర్టులో సిన్నర్ 28 వరుస విజయాల పరంపరకు అల్కరాజ్ ఫుల్‌స్టాప్ పెట్టాడు. నాలుగు సెట్ల పాటు హోరాహోరీగా సాగిన పోరులో విజయం సాధించిన అల్కరాజ్ తన కెరీర్‌లో ఆరో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నాడు. 22 ఏండ్ల అల్కరాజ్‌కు ఇది రెండో యూఎస్ ఓపెన్ టైటిల్ కావడం విశేషం.

యూఎస్ ఓపెన్‌లో అల్కరాజ్, సిన్నర్ మధ్య ఫైనల్ పోరు కొదమసింహాలను తలపించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాక నేపథ్యంలో మ్యాచ్ నిర్ణీత సమయం కంటే అర్ధగంట ఆలస్యంగా మొదలైంది. టోర్నీలో ప్రత్యర్థికి ఒక్క సెట్ కోల్పోని అల్కరాజ్ ఒకవైపు అయితే.. మరోవైపు టైటిల్ నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో సిన్నర్‌బరిలోకి దిగాడు. మొదటి సెట్‌లో సిన్నర్ ఒకింత తడబడగా, ఇదే అదనుగా అల్కరాజ్ రెచ్చిపోయాడు. బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్లతో ఆధిపత్యం ప్రదర్శించిన అల్కరాజ్ తొమ్మిది విన్నర్ల తొలి బ్రేక్ పాయింట్ అందుకున్నాడు. 5-2 ఆధిక్యంతో నలభై నిమిషాల్లోపే మొదటి సెట్ ఖాతాలో వేసుకున్నాడు. అయితే రెండో సెట్‌లో సిన్నర్ అనూహ్యంగా పుంజుకున్నాడు. అల్కరాజ్‌కు దీటైన పోటీనిస్తూ సెట్‌ను దక్కించుకోవడంతో మ్యాచ్ రసవత్తరంగా మారింది. ఈ క్రమంలో సిన్నర్ నుంచి ఎదురైన గత అనుభవాలను దృష్టిలో పెట్టుకున్న అల్కరాజ్ మరో అవకాశమివ్వకుండా చెలరేగాడు. కోర్టులో చిరుతను తలపిస్తూ అల్కరాజ్ సంధించిన షాట్లకు సిన్నర్ దగ్గర సమాధానం లేకపోయింది. ఈ క్రమంలో అల్కరాజ్ కొట్టిన బౌన్స్ షాట్ సిన్నర్‌కు అందకుండా బుల్లెట్‌లా దూసుకుపోయింది. 4-0తో ఆధిక్యంలో ఉన్న సమయంలో బ్రేక్ పాయింట్ దక్కించుకున్న అల్కరాజ్ సెట్‌ను కైవసం చేసుకున్నాడు. నాలుగో సెట్‌లోనూ ఎక్కడా వెనుకకు తగ్గని అల్కరాజ్ కూల్‌గా తన పని కానిచ్చాడు. మ్యాచ్‌లో 11వ ఏస్‌తో టైటిల్ విజేతగా నిలిచాడు. 1 యూఎస్ ఓపెన్ టైటిల్ ద్వారా అల్కరాజ్ నంబర్‌వన్ ర్యాంక్ దక్కించుకున్నాడు. 65 వారాల పాటు అగ్రస్థానంలో ఉన్న సిన్నర్‌ను రెండో ర్యాంక్‌కు పరిమితం చేశాడు.